క్లుప్తంగా

ప్రశ్నిస్తున్నందుకే వేటు

కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మాణయ్య



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

మొయినాబాద్: కేంద్ర బీజేపీ ప్రభుత్వం ప్రశ్నించే గొంతులను నొక్కేస్తుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మాణయ్య ఆరోపించారు. శనివారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. పార్లమెంట్‌లో రాహుల్‌గాంధీ, మోదీ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నందుకే ఆయనపై అనర్హత వేటు వేశారన్నారు. రాహుల్‌గాంధీని ఎదుర్కోలేకే అనవసరమైన కేసులు పెట్టారని మండిపడ్డారు. రాహుల్‌పై అనర్హత వేటు వేయడం అప్రజాస్వామికమని.. ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరికి ప్రశ్నించే హక్కు ఉంటుందన్నారు. బీజేపీ నిరంకుశత్వానికి ఇది నిదర్శనమన్నారు. రాహుల్‌పై అనర్హత వేటును తొలగించి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలన్నారు. లేదంటే ఎంతటి పోరాటానికైనా కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉందన్నారు. సమావేశంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గౌరి సతీష్, పీఏసీఎస్ చైర్మన్ చంద్రారెడ్డి, మాజీ సర్పంచ్ సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీ గణేష్‌గౌడ్, నాయకులు కేబుల్ రాజు, రియాజ్, మక్బుల్, మల్లేష్‌గౌడ్, బాలకృష్ణారెడ్డి, రాజుగౌడ్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు బలవర్ధక ఆహారం అవసరం

హోమియోపతి డాక్టర్ సంయుక్తరాణి



న్యూట్రీషన్ కిట్లు అందజేస్తున్న సంయుక్తరాణి

మొయినాబాద్: విద్యార్థులకు బలవర్ధకమైన ఆహారం అవసరమని హోమియోపతి డాక్టర్ జి.సంయుక్తరాణి అన్నారు. మండల పరిధిలోని చిలుకూరు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో శనివారం న్యూట్రీషన్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పరీక్షల సమయంలో విద్యార్థులకు న్యూట్రీషన్ ఫుడ్ అవసరమన్నారు. న్యూట్రీషన్ వల్ల సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. 10వ తరగతి విద్యార్థులతో పాటు అన్ని తరగతుల విద్యార్థులకు ఆయుష్ న్యూట్రీషన్ కిట్లను అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఫార్మసిస్టు రమేష్, సిబ్బంది సముద్ర, ఉపాధ్యాయులు, అంగన్వాడీ టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రాల్లో వసతులు కల్పించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కొత్తూరు: ఈ నెల 3వ తేదీ నుంచి జరగనున్న పదో తరగతి పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు అన్ని వసతులు కల్పించాలని ఏబీవీపీ మండల కన్వీనర్ నరేష్‌చారి కోరారు. ఇందులో భాగంగా ఆయన శనివారం పలువురు నాయకులతో కలిసి ఎంఈఓ కార్యాలయంలో సిబ్బందికి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, ప్రథమ చికిత్సకు సంబంధించిన మందులు, గదుల్లో ఫ్యాన్లు, సరైన వెలుతురు ఉండే విధంగా లైట్లు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు శివకుమార్‌చారి, విష్ణువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

షాద్‌నగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా వేణుగోపాల్‌రావు



షాద్‌నగర్: షాద్‌నగర్ బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా సీనియర్ న్యాయవాది నర్వ వేణుగోపాల్ రావు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ ఎన్నికలు జరిగాయి. అధ్యక్షుడిగా నర్వ వేణుగోపాల్‌రావు, ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్ రెడ్డి, సురేందర్‌రెడ్డి, ప్రధానకార్యదర్శిగా మనోహర్‌రెడ్డి, సహాయ కార్యదర్శులుగా మదన్ మోహన్, నరేంద్రనాథ్, కోశాధికారిగా శ్రీనివాస్‌మూర్తి, లైబ్రేరియన్‌గా లింగంగౌడ్, స్పోర్ట్స్ అండ్ కల్చర్ సెక్రటరీగా అంజయ్య, సభ్యులుగా శివకుమార్, మల్లేష్, మహేష్‌చంద్ర ఎన్నికయ్యారు.నూతన కార్యవర్గం సభ్యులను న్యాయవాదులు పూలమాలలు శాలువాలతో ఘనంగా సన్మానించారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

షాద్‌నగర్‌రూరల్: కేశంపేట మండల పరిధిలోని నిర్దవెల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న పోచమ్మ దేవాలయం నిర్మాణానికి శనివారం వైఎస్సార్ తెలంగాణ పార్టీ షాద్‌నగర్ కోఆర్డినేటర్ ఎండీ ఇబ్రహీం లక్షా 16రూపాయలు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యాలయంలో ఆయన ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులకు చెక్కును అందజేశారు.

మోదీ హటావో దేశ్‌కో బచావో

సీపీఐ జిల్లా కార్యదర్శి జంగయ్య

చేవెళ్ల: మోదీ హటావో దేశ్‌కో బచావో అనే కార్యక్రమం ఇంటింటికి తీసుకెళ్లాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య పిలుపునిచ్చారు. మండలకేంద్రంలోని అర్అండ్‌బీ అతిథిగృహంలో శనివారం నియోజకవర్గ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 14వ తేదీ నుంచి మే 15వ తేదీ వరకు ఈ కార్యక్రమం పార్టీ శ్రేణులు నిర్వహించాలని కోరారు. కేంద్రంలో నరేంద్రమోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలో అవినీతి పెరిగిపోయిందన్నారు. దేశంలో మునుపెన్నడూ లేని విధంగా ప్రజల సొమ్ము దోచుకున్నారని ఆరోపించారు. అలాగే, మైనార్టీల, దళిత, గిరిజనుల మహిళలపై దాడులు హత్యలు, అత్యాచారాలు, అధికమయ్యాయన్నారు. ప్రతి గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి కేంద్ర ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోయయాయని, వ్యవసాయ రంగం నిర్వీర్యమైందని , పరిశ్రమలు దివాలా తీశాయన్నారు. భారత ఆర్థిక వ్యవస్థ కుదేలు అయిందని ఆరోపించారు. నియోజకవర్గంలోని మొయినాబాద్, షాబాద్, శంకర్‌పల్లి, చేవెళ్ల మండలాల్లో గ్రామాల్లో ఈ కార్యక్రమం ద్వారా ఇంటింటికి వెళ్తున్నట్లు చెప్పారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రామస్వామి, కోకన్వీనర్లు ప్రభులింగం, గోపాల్‌రెడ్డి, మండల కార్యదర్శి సత్తిరెడ్డి, నాయకులు సత్యనారాయణ, సుధాకర్‌గౌడ్, సుభాన్‌రెడ్డి, సుధీర్, శ్రీనివాస్, మక్బుల్, శౌరీలు, మంజుల, మాధవి, విజయమ్మమీనాక్షి, శివయ్య, శ్రీను, రామచంద్రయ్య, మల్లేశ్, రఘురాం, తదితరులు పాల్గొన్నారు.



చేవెళ్ల: సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య

మోదీ హయాంలో ఆర్థిక వ్యవస్థ కుదేలు

షాద్‌నగర్: ప్రధానమంత్రి మోదీ హయాంలో దేశ ఆర్థిక వ్యవస్థ పూర్తిగా కుదేలైందని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య ఆరోపించారు. శనివారం పట్టణం శివారులోని యమ్మి హోటల్‌లో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశానికి హాజరైన జంగయ్య మాట్లాడుతూ.. బీజేపీ అధికారంలోకి వచ్చాక దేశంలో అవినీతి పెరిగిపోయిందన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తూ వారికి అనుకూలంగా చట్టాలను తీసుకొస్తుందన్నారు. చిన్న మధ్య తరహా పరిశ్రమలు మూతపడుతున్నాయని తద్వారా కార్మికుల బతుకులు అగమ్యగోచరంగా మారాయని ఆరోపించారు.నిరుపేదలకు అండగా నిలిచి వారి అభ్యున్నతికి పాటు పడాల్సిన కేంద్రం ప్రజా వ్యతిరేఖ విధానాలను అవలంబిస్తుందన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీని ఓడించేందుకు ప్రజలందరు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. దేశ వ్యాప్తంగా మోదీ హటావో దేశ్‌కో బచావో ఇంటింటి కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నియోజవర్గ కన్వీనర్ పానుగంటి పర్వతాలు, కోకన్వీనర్‌లు బుద్దుల జంగయ్య, శ్రీను, గోవింద్ నాయక్, షకీల్, జంగయ్య, చంద్రబాబు, ఎల్లయ్య, మంజుల, మహబూబ్ తదితరులు పాల్గొన్నారు.

ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం

ధ్యాన ప్రచార కార్యదర్శులు ఆంజనేయరెడ్డి, గోపాల్‌రెడ్డి

షాబాద్: ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం మానసిక ప్రశాంతత లభిస్తుందని పిరమిడ్ స్పిరిచువల్ సొసైటీ ధ్యాన ప్రచార కార్యదర్శులు బంగ్లా ఆంజనేయరెడ్డి, గోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని సర్దార్‌నగర్, కక్కులూర్, బోడంపహాడ్ గ్రామాల్లో ధ్యానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భవిష్యత్తులో వ్యాధులు రాకుండా ఉండడానికి ధ్యానం ఉపకరిస్తుందని తెలిపారు. నిత్యజీవితంలో ధ్యానం చేయడం దినచర్యగా మార్చుకోవాలన్నారు. ప్రమాదకరమైన క్యాన్సర్, గుండె జబ్బులు, బీపీ, షుగర్ వ్యాధులు కూడా ధ్యానం ద్వారా తగ్గుతాయని చెప్పారు. కార్యక్రమంలో పిరమిడ్ సంస్థ సభ్యులు బాలకృష్ణారెడ్డి, జంగయ్య, వెంటలక్ష్మి, శైలజ, జ్యోతి, సురేష్‌రెడ్డి, వేణు, రాంచంద్రయ్య, శ్రీనివాస్ తదితరులున్నారు.

కేశంపేట: ధ్యానంతో ఆరోగ్యంగా ఉంటారని స్పిరిచువల్ సొసైటీ ధ్యాన ప్రచార కార్యదర్శి బంగ్లా ఆంజనేయరెడ్డి అన్నారు. మండల పరిధిలోని పాపిరెడ్డిగూడ, దత్తాయపల్లి గ్రామాల్లో ఆదివారం ధ్యానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆంజనేయరెడ్డి మాట్లాడుతూ... శరీరంలోని వ్యాధులతో పాటు, కొత్తగా వ్యాధులు సోకకుండా ధ్యానం ఉపకరిస్తుందని అన్నారు. కార్యక్రమంలో బాలకృష్ణారెడ్డి, శివకుమార్, నవీన్, జంగయ్య, వెంకటలక్ష్మి, శైలజ, జ్యోతి, సురేష్‌రెడ్డి, వేణు, రాంచంద్రయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



షాబాద్: ధ్యానంపై అవగాహన కల్పిస్తున్న గోపాల్‌రెడ్డి

డప్పు కృష్ణ ఆశయ సాధనకు కృషి

సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు రాజు

షాద్‌నగర్‌రూరల్: కుల వివక్ష పోరాట సమితి నియోజకవర్గ వ్యవస్థాపకులు డప్పు కృష్ణ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రాజు అన్నారు. శనివారం పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బీససాయిబాబు ఆధ్వర్యంలో డప్పు కృష్ణ 10వ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు డప్పు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం రాజు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో నిరుపేదలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృష్ణ ఎంతో కృషి చేశారని అన్నారు. ఇళ్లు లేని పేదలకు, దళితులకు ఇంటి స్థలాలు ఇవ్వాలని, దళితుల సమస్యలను పరిష్కరించాలని పెద్ద ఎత్తున పోరాటాలను చేపట్టారని తెలిపారు. గ్రామాల్లో పాతుకుపోయిన కుల వివక్షతను రూపు మాపేందుకు కుల వివక్ష పోరాట సంఘాలను ఏర్పాటు చేసి ప్రజలందరిని ఐక్యం చేసేందుకు ప్రజా పోరాటాలను చేపట్టారని కొనియాడారు. డప్పుకృష్ణ ఆశయాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు శ్రీనునాయక్, ఈశ్వర్, కుర్మయ్య, రాజు, లక్ష్మి, నర్సింలు, రాములు, శ్రీకాంత్, యాదయ్య పాల్గొన్నారు.



డప్పుకృష్ణ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ



నోట్‌బుక్స్ పంపిణీ చేస్తున్న రవీందర్‌రెడ్డి

కొత్తూరు: మండల పరిధిలోని కొడిచర్ల గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు శనివారం స్థానిక ఎంపీటీసీ రవీందర్‌రెడ్డి తన సొంత ఖర్చులతో పెన్నులు, నోట్‌బుక్స్, పరీక్షా ప్యాడ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం విద్యార్థులకు పరీక్షల సమయం కావున తనవంతుగా సహాయం చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకుని చదువుల్లో ఉన్నతంగా రాణించాలని కోరారు. భవిష్యత్‌లో చదువుకున్న వారికే అన్ని రంగాల్లో ప్రాధాన్యత ఉంటుందనే విషయాన్ని విద్యార్థులు గ్రహించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

షాద్‌నగర్: శ్రీరామ కల్యాణోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం మండల పరిధిలోని వెలిజర్లలో గ్రామస్తులు ఘనంగా స్వామివారి రథోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరామచంద్రుడు, ఆంజనేయస్వామి విగ్రహాలను ప్రత్యేకంగా అలకరించి గ్రామంలోని పురవీధుల గుండా ఊరేగించారు. ఊరేగింపులో భజనలు, రామనామ స్మరణతో గ్రామం మార్మోగింది. మహిళలు బతుకమ్మ ఆటలు ఆడారు. కార్యక్రమంలో సర్పంచ్ అమృతమ్మ, ఎంపీటీసీ లావణ్య, అశోక్‌రెడ్డి, నర్సింహ్మారెడ్డి, రాజు, అశోక్‌రెడ్డి, శివరాజ్‌గౌడ్, గణేష్‌గౌడ్, జాంగారి రవి, కావలి యాదయ్య, నరేందర్‌రెడ్డి, లష్కర్ నాయక్, వెంకటేష్ యాదవ్, చిన్న, శిరాజుగౌడ్ పాల్గొన్నారు.

బీజేపీ అసెంబ్లీ కన్వీనర్‌గా విజయ్‌కుమార్

షాద్‌నగర్: బీజేపీ షాద్‌నగర్ అసెంబ్లీ కన్వీనర్‌గా సీనియర్ నేత డాక్టర్ టంగుటూరి విజయ్‌కుమార్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా శనివారం బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్ కుమార్‌రెడ్డి నియామక ఉత్తర్వులు జారీ చేశారు. విజయ్‌కుమార్ 1993లో బీజేపీలో చేరిన ఆయన రెండుసార్లు పార్టీ పట్టణ అధ్యక్షుడిగా, ఫరూఖ్‌నగర్ మండల పార్టీ అధ్యక్షుడిగా, జిల్లా డాక్టర్ సెల్ కన్వీనర్‌గా డాక్టర్ విజయ్‌కుమార్ సేవలు అందించారు. అదేవిధంగా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ చేపట్టిన ప్రజా సంగ్రామ యాత్రలో వైద్య విభాగ్ ప్రముఖ్‌గా సేవలందించారు. పార్టీలో సీనియర్ నేతగా విశేష సేవలు అందించిన ఆయనను అసెంబ్లీ కన్వీనర్‌గా నియమించారు.

పేదల ఆరోగ్యంపై సర్కార్ నిర్లక్ష్యం

బీజేపీ మహిళా మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యురాలు తంగ్లై సెల్వి

షాద్‌నగర్: పేదల ఆరోగ్యంపై బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని బీజేపీ మహిళా మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యురాలు తంగ్లై సెల్వి అన్నారు. షాద్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రిని శనివారం ఆమె సందర్శించి రోగులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో పేదలకు నాణ్యమైన వైద్యం అందిస్తామని చెప్పిన సీఎం కేసీఆర్ హామీ ఏమైందని ప్రశ్నించారు. కరోనా సమయంలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో సరైన వైద్యం అందక, ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్సలకు డబ్బులు చెల్లించలేక చాలా మంది పేదలు చనిపోయారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ఆయుష్మాన్ భారత్ పథకాన్ని ప్రవేశపెడితే తెలంగాణలో సీఎం సీఆర్ ఈ పథకాన్ని మూడేళ్ళు ఆలస్యంగా అమలు చేసి పేదలకు అన్యాయం చేశారని వాపోయారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్య సిబ్బంది అంతంత మాత్రంగానే ఉన్నారని అన్నారు. ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టులను ప్రభుత్వం వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి జిల్లాలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, మండలంలో 30 పడకల ఆస్పత్రి నిర్మిస్తామని చెప్పిన సీఎం హామీ ఏమైందని ప్రశ్నించారు. అదేవిధంగా ఆరోగ్య శ్రీ పథకంలో పేదలకు వైద్యం అందించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు శ్రీవర్ధన్‌రెడ్డి, పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి, అందెబాబయ్య, దేపల్లి అశోక్‌గౌడ్, డాక్టర్ విజయ్‌కుమార్, వెంకటేష్‌గుప్త, వెంకటేశ్వర్‌రెడ్డి, వంశీకృష్ణ, సుజాత, ఇందిరా, నిర్మల,మల్చలం మురళీ, రుషికేష, కుర్మయ్య, ఉమాదేవి, పాల్గొన్నారు.



రోగులతో మాట్లాడుతున్న బీజేపీ నాయకురాలు తంగ్లై సెల్వి

చదువుతోనే సమాజంలో గుర్తింపు



మాట్లాడుతున్న ఎంఈఓ శంకర్‌రాథోడ్

ఎంఈఓ శంకర్‌రాథోడ్

షాబాద్: చదువుతోనే సమాజంలో గుర్తింపు ఉంటుందని ఎంఈఓ శంకర్‌రాథోడ్ అన్నారు. శనివారం మండల పరిధిలోని నాగర్‌కుంట ప్రాథమికోన్నత పాఠశాల వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు చేసిన సంస్కృతిక ప్రదర్శనలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను సద్వినియోగం చేసుకొని చదువులో రాణించాలన్నారు. బాగా చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని, కష్టపడి కాకుండా ఇష్టపడి చదివి తమ తల్లిదండ్రులు కన్నా కలలను నిజం చేయాలని చెప్పారు. నిరక్షరాస్యతను నిర్మూలించి అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పీఆర్టీయూ మండల శాఖ అధ్యక్షుడు సుదర్శన్, పాఠశాల హెచ్‌ఎం యాదయ్య, చైర్మన్ నందీశ్వర్, దాతలు మహేష్, సాయి, ఉపాధ్యాయులు అంజనేయులు, మన్నాన్, శ్రీకన్య, సరోజ, కీర్తన తదితరులున్నారు.

రాహుల్‌పై అనర్హత వేటు ఎత్తివేయాలి

కాంగ్రెస్ నాయకుడు నర్సింహయాదవ్

నందిగామ: రాహుల్ గాంధీపై అనర్హత వేటును వెంటనే ఎత్తివేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జంగ నర్సింహయాదవ్ కేంద్ర బీజేపీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రమైన నందిగామలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అంబానీ , ఆదానీలకు దేశ సంపద దోచి పెడుతున్నాడని ఆరోపించారు. బీజేపీ ప్రభుత్వం చేస్తున్న అవినీతి అక్రమాలను ప్రశ్నిస్తున్న రాహుల్ గాంధీపై అనర్హత వేటు వేయడం సిగ్గుచేటని విమర్శించారు. రాహుల్ గాంధీపై విధించిన అనర్హత వేటును వెంటనే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేనట్లయితే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలను చేపడుతామని హెచ్చరించారు. సమావేశంలో ఎంపీటీసీలు కొమ్ము కృష్ణ, చంద్రపాల్ రెడ్డి, కుమార్‌గౌడ్, కొత్తూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు హరినాథ్‌రెడ్డి, నందిగామ పీఏసీఎస్ వైస్ చైర్మన్ జంగ రజినీకాంత్ యాదవ్ పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకుడు నర్సింహయాదవ్

క్రీడలపై ఆసక్తికి టోర్నమెంట్లు దోహదం



పోటీలను ప్రారంభిస్తున్న సీఐ వెంకటేశ్వర్లు, నాయకులు

సీఐ వెంకటేశ్వర్లు

చేవెళ్ల: గ్రామీణ ప్రాంతాల్లో టోర్నమెంట్‌లతో యువతకు క్రీడలపై ఆసక్తి పెరుగుతుందని చేవెళ్ల సీఐ వెంకటేశ్వర్లు అన్నారు. మండలకేంద్రంలోని కేవీఆర్ గ్రౌండ్‌లో శనివారం చేవెళ్లకు చెందిన కనకమామిడి వెంకట్‌రెడ్డి, మాడి రంగారెడ్డిల జ్ఞాపకార్థం కనకమామిడి మల్లారెడ్డి ఆధ్వర్యంలో విలేజ్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలను సీఐ పలువురు నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడాస్ఫూర్తి ప్రతి ఒక్కరిలో ఉండాలన్నారు. గెలుపోటములు సమానంగా తీసుకోవాలని చెప్పారు. క్రీడలతో మానసిక ఉల్లాసం, శరీరక దృఢత్వం పెంపొందుతుందన్నారు. నియోజకవర్గ స్థాయిలో ఐదు మండలాలకు చెందిన క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. దీని వల్ల క్రీడాకారుల మధ్య స్నేహసంబంధాలకు దోహదం చేస్తాయన్నారు. ఇలాంటి పోటీలు తరుచు నిర్వహిస్తూ క్రీడాకారులను ప్రోత్సహించాలని చెప్పారు. టోర్నమెంట్ నిర్వహిస్తున్న కనకమామిడి మల్లారెడ్డిని ఆయన అభినందించారు. కార్యక్రమంలో చేవెళ్ల పీఏసీఎస్ డైరెక్టర్ క్రిష్టారెడ్డి, కిష్టారెడ్డి, దుర్గప్రసాద్, తిరుపతిరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి ఉన్నారు.

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం

అంగన్‌వాడీ టీచర్ అంబుజాక్షి

షాబాద్: చిరుధాన్యాల వినియోగంతోనే పెద్దలు, పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని నాగర్‌గూడ అంగన్‌వాడీ టీచర్ అంబుజాక్షి అన్నారు. శనివారం మండల పరిధిలోని నాగర్‌గూడ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం చిరుధాన్యాలతో తయారు చేసిన వంటకాలను ప్రదర్శించారు. చేతుల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. చిరుధాన్యాల్లో పిండి పదార్థం, ప్రోటీన్లు, కాల్షియం అధికంగా ఉంటుందన్నారు. ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను ప్రోత్సహించేందుకే ప్రభుత్వం పోషణ్ అభియాన్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. తమ పూర్వీకులు చిరుధాన్యాలు ఆహారంగా తీసుకోవడం వల్లే ఎలాంటి వ్యాధులు లేకుండా ఆర్యోగంగా జీవించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అజీమ్, కరోబార్ శ్రీనివాస్ ఉన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి



టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న మాధవి

ఎంపీటీసీ మాధవి

నందిగామ: యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని మామిడిపల్లి ఎంపీటీసీ సభ్యురాలు కాట్న మాధవి అన్నారు. మండల పరిధిలోని మొదళ్లగూడలో సర్పంచ్ ఉమ ప్రవీణ్‌రెడ్డిల కుమారుడు స్వర్గీయ సాక్షిత్‌రెడ్డి జ్ఞాపకార్థం శనివారం నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌ను మామిడిపల్లి ఎంపీటీసీ మాధవి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మాధవి మాట్లాడుతూ.. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా మాజీ జెడ్పీవైస్ చైర్మన్ నాగరకుంట నవీన్‌రెడ్డి ఆర్థిక సహాయంతో ఈ టోర్నమెంట్ నిర్వహిస్తున్నామన్నారు. గ్రామీణ ప్రాంతంలోని యువత తమలోని నైపుణ్యం మెరుగుపర్చుకోవడానికి ఈ క్రీడలు ఎంతగానో దోహదపడుతాయని సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శోభారెడ్డి, ఉప సర్పంచ్ షఫీ సోఫియా, వార్డు సభ్యులు శ్రీను, అబ్బాస్, రాజు, భాగ్యమ్మ, సునీత, యాదమ్మ, శ్రీరాం, ఆంజనేయులు,మామిడిపల్లి ఉప సర్పంచ్ హన్మంత్ రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ సత్యనారాయణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

వేద పాఠశాల సందర్శన

షాద్‌నగర్‌టౌన్: మండల పరిధిలోని కిషన్‌నగర్ గ్రామ శివారులోని కాశీ వేద పాఠశాలను శనివారం ఉదయం కాశీ జగద్గురు చంద్రశేఖర శివాచార్య స్వామి సందర్శించారు. అనంతరం వేద పాఠశాల విద్యార్థులతో మాట్లాడారు. కార్యక్రమంలో షాద్‌నగర్ వీరశైవ సమాజం నాయకులు బస్వలింగప్ప, బసవేశ్వర్, ఆనంద్‌కుమార్, కాశీనాథ్, రాజేష్‌లు కాశీ జగద్గురును కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు.

కులమతాలకు అతీతంగా ఉత్సవాలు

హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ

మొయినాబాద్‌రూరల్: ఉత్సవాలను అందరు కలిసి జరుపుకోవాలని హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. శనివారం చేవెళ్ల అసెంబ్లీ ఇన్‌చార్జి కంజర్ల ప్రకాష్ నివాసంలో ఏర్పాటు చేసిన విందులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కనకమామిడి మల్లికార్జున స్వామి, మేడాలమ్మ, గొల్లకేతమ్మ కల్యాణ మహోత్సవ కార్యక్రమం ఆహ్వాన పత్రిక, వాల్‌పోస్టర్ గవర్నర్ దత్తాత్రేయ చేతుల మీదుగా ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేశంలో పండుగలను కులమతాలకు అతీతంగా జరుపుకున్నప్పుడే ఆ పండుగలు ప్రజలకు ఎంతో ఆనందాన్ని ఇస్తాయని తెలిపారు. కనకమామిడిలో ఈ నెల 22వ తేదీ నుంచి నిర్వహిస్తున్న బీరప్పస్వామి, కామరాతి అమ్మవార్ల కల్యాణ మహోత్సవం నిర్వహించుకోవడం అభినందనీయమని తెలిపారు. ఈ ఉత్సవాలను గ్రామస్తులే కాకుండా వివిధ ప్రాంతాల భక్తులు పాల్గొనే విధంగా ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ ఉత్సవాలకు తాను తప్పనిసరిగా హాజరవుతానని చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు బెక్కరి జనార్దన్‌రెడ్డి, మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, సిద్ధిపేట బీజేపీ ఇన్‌చార్జి అంజన్‌కుమార్‌గౌడ్, రాష్ట్ర సెన్సార్ బోర్డు మెంబర్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు జంగారెడ్డి, నాయకులు గోపాల్‌రెడ్డి, యాదయ్య, మహేందర్ పాల్గొన్నారు.



మొయినాబాద్‌రూరల్: అమ్మవార్ల కల్యాణ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించిన గవర్నర్ దత్తాత్రేయ